క్లుప్తంగా

నేటి నుంచి జోహరాపురం ఉరుసు


సయ్యద్ అల్లాబకాష్ వలి దర్గా

కర్నూలు(అర్బన్): నగర పరిధిలోని జోహరాపురంలో ఈ నెల 25 నుంచి 27వ తేది వరకు సయ్యద్ అల్లాబకాష్ వలి ఉరుసు నిర్వహిస్తున్నట్లు కార్య నిర్వాహకులు సయ్యద్ అల్లాఉద్దీన్ షరీఫ్ పాషా మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 25వ తేదీన గంధం, 26వ తేదీన ఉరుసు (తట్టీలు), 27వ తేదీన కిస్తీలు నిర్వహించడం జరుగుతుందన్నారు. మూడు రోజుల పాటు జరగనున్న ఈ ఉరుసు ఉత్సవాల్లో గ్రామంలోని హిందు, ముస్లిం, క్రైస్తవులందరు ఐకమత్యంతో మత సామరస్యానికి ప్రతీకగా జరుపుకుంటారన్నారు. ఉత్సవాలకు జిల్లా నలుమూలల నుంచే కాక, పక్కనున్న తెలంగాణ రాష్ట్రం నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు హాజరవుతారన్నారు.

మైనర్లకు ద్విచక్ర వాహనాలు ఇవ్వొద్దు

కర్నూలు : నగరంలో మైనర్లు ద్విచక్ర వాహనాలు నడిపి వాటిని అదుపు చేయలేక ప్రమాదానికి గురవుతున్నారని కర్నూలు ఎమ్మెల్యే హఫీజ్ ఖాన్ అన్నారు. ప్రమాదాల నివారణకు ట్రాఫిక్ పోలీసులు కొంతకాలంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారన్నారు. ఉజ్వల భవిష్యత్తు ఉన్న పిల్లలకు వాహనాలు ఇచ్చే విషయంలో తల్లిదండ్రులు ఆలోచించాలని మంగళవారం విడుదల చేసిన వీడియో మెసేజ్‌లో ఎమ్మెల్యే సూచించారు. మైనర్ డ్రైవింగ్‌లో తొలిసారి పట్టుబడిన వారికి అధిక ఫైన్లు వేయకుండా మొదట కౌన్సిలింగ్ ఇవ్వాలని పోలీసు, రవాణా శాఖ అధికారులకు ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు.

26న ఎంపిక పోటీలు

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలోని మునిసిపల్ హైస్కూల్ క్రీడా మైదానంలో ఈ నెల 26న ఉమ్మడి జిల్లాల బాల్ బ్యాడ్మింటన్, ఫెన్సింగ్, రోప్ స్కిప్పింగ్, షటిల్ బ్యాడ్మింటన్ ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఉమ్మడి జిల్లాల కార్యదర్శులు వి. శివకుమార్, జీ. లక్ష్మయ్య మంగళవారం తెలిపారు. స్కూల్ గేమ్ ఫెడరేషన్ 2023–24 అండర్- 14, అండర్- 17 విభాగంలో జిల్లా స్థాయి ఎంపికలు ఉంటాయన్నారు. షటిల్ బాడ్మింటన్ పోటీలు బొమ్మల సత్రంలోని నంది పైప్స్ కంపెనీ లోని ఆడిటోరియంలో జరుగుతాయన్నారు. వ్యాయామ ఉపాధ్యాయులు క్రీడాకారులను ఎంట్రీఫారంను, మిడ్‌డే మీల్స్ ఫారం తీసుకురావాలన్నారు. క్రీడాకారులకు భోజన వసతి ఏర్పాటు చేశామన్నారు. ఎంపిక పోటీలకు కర్నూలు, నంద్యాల డీఈఓలు రంగారెడ్డి, సుధాకర్‌రెడ్డి ముఖ్యఅతిథులుగా హాజరవుతారని చెప్పారు.

స్కై మార్షల్ ఆర్ట్స్‌లో ఏ గ్రేడ్ సర్టిఫికెట్

నంద్యాల(న్యూటౌన్): నేషనల్ స్కై మార్షల్ ఆర్ట్స్ రెఫరీ సెమినార్‌లో నంద్యాల జిల్లా మార్షలార్ట్స్ అసోసియేషన్ కార్యదర్శి నూర్‌బాషా ఏ గ్రేడ్ సర్టిఫికెట్ సాధించినట్లు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 22, 23 తేదీల్లో నెల్లూరులోని స్కై ఫెడరేషన్ ఆఫ్ ఇండియా నిర్వహించిన కోచింగ్ క్యాంప్, రెఫరీ సెమినార్‌లో అత్యంత ప్రతిభచాటడంతో తనకు ఏ-గ్రేడ్ సర్టిఫికెట్ ఇచ్చారని పేర్కొన్నారు. ఈ సెమినార్‌లో 23 జిల్లాల నుంచి 40 మంది పాల్గొన్నారని, ఇందులో నంద్యాల జిల్లాకు ఏ-గ్రేడ్ బహుమతి ఇచ్చినట్లు వెల్లడించారు.

ఆర్ట్ గెలాక్సీ అవార్డుకు కోటేష్ ఆర్ట్ అకాడమీ ఎంపిక

నంద్యాల(అర్బన్): ఆర్ట్ గెలాక్సీ అవార్డుకు కోటేష్ ఆర్ట్ అకాడమీ సంస్థ ఎంపికైనట్లు ప్రముఖ చిత్రకారుడు చింతలపల్లె కోటేష్ మంగళవారం తెలిపారు. ఒంగోలుకు చెందిన సృష్టి ఆర్ట్ అకాడమీ నిర్వాహకులు శేస బ్రహ్మం, రవీంద్రలు కోటేష్ ఆర్ట్ అకాడమీ సంస్థ చిత్రకళ సేవలను గుర్తించి అవార్డుకు ఎంపిక చేశారన్నారు. స్థానిక కార్యాలయంలో ఆయన మాటాలడుతూ ఈ నెల 29న ఒంగోలు లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ భవన్‌లో ప్రముఖుల చేత అవార్డు ప్రదనం చేయనున్నారన్నారు. కోటేష్ ఆర్ట్ అకాడమీ విద్యార్థులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో అవార్డులు, రివార్డులు సాధించారన్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు చీరల పంపిణీ


చీరలు పంపిణీ చేస్తున్న కార్పొరేటర్

కల్లూరు: దసరా పండుగను పురస్కరించుకుని 26వ వార్డు కార్పొరేటర్ దండు లక్ష్మీకాంతరెడ్డి, ప్రగతి రూరల్, ఎడ్యుకేషనల్ డెవలప్‌మెంట్ సొసైటీ మేనేజింగ్ డైరెక్టర్ మమతారెడ్డి ఆధ్వర్యంలో పారిశుద్ధ్య కార్మికులకు చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ ప్రగతి సొసైటీ సమాజంలో చేసే సేవా కార్యక్రమాలకు తమ సహకారం ఎల్లప్పుడు ఉంటుందన్నారు. కార్యక్రమంలో నాయకులు భాస్కర్‌రెడ్డి, రమణారెడ్డి, బ్రహ్మానందరెడ్డి, దేవదాసు, రామచంద్రుడు తదితరులు పాల్గొన్నారు.

సంబరం

- నగరంలో అంబరాన్నంటిన దసరా వేడుకలు
- ఆలయాల్లో అమ్మవార్లకు, శమీవృక్షాలకు ప్రత్యేక పూజలు
- పాల్గొన్న ప్రజాప్రతినిధులు, నాయకులు


లలితా పీఠంలో అమ్మవారు


నగరంలో శమీ వృక్ష పూజలో పాల్గొన్న భక్తజనం

కర్నూలు కల్చరల్: నగరంలో విజయదశమి వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. పాతనగరంలోని జమ్మిచెట్టు, బీక్యాంప్ రాజరాజేశ్వరి దేవి ఆలయం, జిల్లా గో రక్షణశాల, బుధవారపేట త్రీటౌన్ పోలీస్ స్టేషన్ సమీపం, సీక్యాంప్‌లోని టీటీడీ కల్యాణ మండపం ఆవరణ, మెడికల్ కాలేజ్ మైదానం, అశోక్ నగర్ ప్రసన్నాంజనేయ స్వామి ఆలయం, పాతనగరం నగరేశ్వరస్వామి ఆలయం, పాత కల్లూరు, లలితా పీఠం, సూర్యనారాయణ స్వామి ఆలయం, సప్తగిరి నగర్ మణికంఠ అయ్యప్ప స్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరిగాయి. పల్లకీ సేవలు, రథోత్సవాలు, ఉత్సవ విగ్రహాల ఊరేగింపు, ఆధ్యాత్మిక సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కేడీసీసీబీ చైర్మన్ ఎస్వీ విజయలక్ష్మి, మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్ రెడ్డి, వీహెచ్‌పీ రాష్ట్ర అధ్యక్షుడు నందిరెడ్డి సాయిరెడ్డి, బజరంగ్‌దళ్ రాష్ట్ర కన్వీనర్ ప్రతాప్‌రెడ్డి, బీజేపీ నాయకులు కగ్గోలు హరీష్ బాబు, గణేష్ మహోత్సవ కేంద్ర సమితి నగర అధ్యక్షుడు డాక్టర్ మోక్షేశ్వరుడు, లలితా పీఠం పీఠాధిపతి మేడా సుబ్రహ్మణ్య స్వామి ఓల్డ్‌సిటీలోని జమ్మిచెట్టు వద్ద శమీ వృక్ష పూజల్లో పాల్గొని ప్రసంగించారు. జిల్లా గో రక్షణ శాలలో దేవదాయ శాఖ సహాయ కమీషనర్ ఎం.రామాంజనేయులు, కుటుంబ సభ్యులు, గోశాల ఈవో హనుమంతరావు, ఆవోపా నాయకులు శమీ వృక్షానికి పూజించారు. రాజస్థాన్ విష్ణు సమాజ్ సంఘ్ వారు భారీ ఊరేగింపు నిర్వహించారు. సంఘ్ సభ్యులు, బీజేపీ నాయకులు ఈ వేడుకల్లో పాల్గొన్నారు.

కల్లూరు: విజయదశమిని పురస్కరించుకుని కల్లూరులో శ్రీ చౌడేశ్వరి, చాముండేశ్వరి దేవిలను పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. తర్వాత కల్లూరు చెన్నకేశవ స్వామి పల్లకి, నందికోల సేవలు, కోలాటంలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ చెడుపై మంచి, దుష్టశక్తులపై దైవ శక్తులు సాధించిన విజయానికి ప్రతీకగా దసరా వేడుకలు జరుపుకుంటామన్నారు. ప్రజలు, రైతులు సుఖసంతోషంగా ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ నరసింహులు, నాయకులు సుబ్బారెడ్డి, వీరేంద్రకుమార్, ఈశ్వర, వీరభద్ర, భీమేశ్వర స్వామి దేవస్థానం చైర్మన్లు, చౌడేశ్వరి మాత ఆలయ చైర్మన్ పాలిశెట్టి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

- పందిపాడు గ్రామంలో శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయం రథోత్సవం ఘనంగా జరిగింది. ఆలయ పూజారి హనుమన్న ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకలో గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో శేఖర్ చౌదరి, ఆంజనేయులు, శంకరు, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.


దసరా సంబరాల్లో ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్


నందికోల ఉత్సవంలో ఎమ్మెల్యే కాటసాని


శమీ వృక్ష పూజలో మాజీ ఎమ్మెల్యే ఎస్వీ దంపతులు


ఓల్డ్‌సిటీలోని జమ్మిచెట్టు వద్ద భక్తుల సందడి


సూర్యనారాయణ స్వామి ఆలయంలో ..


రాజస్థాన్ విష్ణు సమాజ్ సంఘ్ ఊరేగింపు...

అభివృద్ధి పరుగులు!

- నగరపాలకకు 15 వ ఆర్థిక సంఘం నిధులు విడుదల
- శానిటేషన్, మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత
- వారంలో టెండర్ల ప్రక్రియ నిర్వహణకు అధికారులు చర్యలు


నగరపాలక సంస్థ కార్యాలయం

కర్నూలు (టౌన్) : నగరంలో అభివృద్ధి పనులు పరుగులు పెట్టనున్నాయి. ఇప్పటికే నాడు- నేడు , గడప గడపకు మన ప్రభుత్వం, జనరల్ ఫండ్స్, అమృత్ పథకం నిధులతో పలు పనులు జరుగుతుండగా తాజాగా ప్రభుత్వం 15వ ఆర్థిక సంఘం నిధులు విడుదల చేసింది. ఈ నిధులతో చేపట్టే పనులకు మున్సిపల్ ఇంజినీరింగ్ అధికారులు ప్రణాళిక సిద్ధం చేశారు. ప్రజోపయోగమైన పనులకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారు. నగరపాలకకు 12 ఏళ్లుగా ఎన్నికలు నిర్వహించకపోవడానికి తోడు గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో నగరంలో అభివృద్ధి కుంటుపడింది. పలు కాలనీల్లో సరైన మౌలిక సదుపాయాలు లేక ప్రజలు ఇబ్బంది పడ్డారు. ఈ క్రమంలో వైఎస్ఆర్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నగరపాలకకు ఎన్నికలు నిర్వహించడం నూతన పాలకవర్గం ఏర్పడటం చకచకా జరిగిపోయింది. ఈ రెండేళ్ల వ్యవధిలోనే నగరంలోని మూడు అర్బన్ ప్రాంతాల్లో ప్రగతి పనులకు శ్రీకారం చుట్టారు. నగరాన్ని సుందరీకరణ చేస్తున్నారు. మున్సిపల్ పార్కులను అందంగా తీర్చిదిద్దారు. స్మార్ట్‌సిటీ వైపు అడుగులు వడివడిగా పడుతున్నాయి. ప్రస్తుతం 15 వ ఆర్థిక సంఘం నిధులు రూ.14.93 కోట్లు విడుదల కావడంతో విలీన గ్రామాలు, శివారు కాలనీల్లో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. కర్నూలు, పాణ్యం, కోడుమూరు అర్బన్ ప్రాంతాల్లో సీసీ రోడ్లు, సీసీ డ్రైన్లు, కల్వర్టుల నిర్మాణాలు చేపట్టేందుకు ఇప్పటికే నగరపాలక ఇంజినీరింగ్ అధికారులు అంచనాలు రూపొందించారు. పనులకు అనుమతులు కూడా మంజూరయ్యాయి.

22 అభివృద్ధి పనులు

నగరపాలక సంస్థకు 15 వ ఆర్థిక సంఘం నిధులు రూ.14.93 కోట్లు విడుదలయ్యాయి. ఈ నిధులతో నగరంలో పలు అభివృద్ధి పనులు చేపట్టేందుకు లైన్ క్లియర్ అయ్యింది. ఇప్పటికే ప్రధాన సమస్యలను గుర్తించిన నగరపాలక ఇంజినీరింగ్ అధికారులు 22 కాలనీల్లో అభివృద్ధి పనులు చేపట్టేందుకు శ్రీకారం చుట్టారు. వారం రోజుల్లో టెండర్లు నిర్వహించి పనులు ప్రారంభిస్తామని నగరపాలక ఇంజనీరింగ్ విభాగం మునిసిపల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ షాకీర్ హుస్సేన్ తెలిపారు.

చేపట్టే పనుల్లో కొన్నింటి వివరాలు

- 12 వ వార్డు పరిధిలోని వడ్డగేరి స్కంద మాల్ నుంచి పాత డబరా వీధి వరకు (రూ. 25 లక్షలు), 13 వ వార్డు బంగారుపేట వద్ద ఆర్ఎస్ రోడ్డులోని అక్బర్ హోటల్ నుంచి కర్నూలు డిగ్రీ కళాశాల వరకు (రూ.25 లక్షలు) సీసీరోడ్ల నిర్మాణం.
- జోహరాపురంలో చెన్నకేశవ దేవాలయం నుంచి మసీదు వరకు రూ. 40 లక్షలతో 750 ఎంఎం సామర్థ్యం కలిగిన సీసీ డ్రైన్లు
- ఆరోరానగర్‌లోని సుద్దవాగు వంక వద్ద రూ.25 లక్షలతో కల్వర్టు నిర్మాణం
- శ్రీరామనగర్, హౌసింగ్ బోర్డు కాలనీ, గీతానగర్, గోపీనగర్‌లలో రూ. 95 లక్షలతో సీసీ డ్రైన్లు
- రూ. 49 లక్షలతో పులిపాటి నగర్, విజయలక్ష్మీనగర్ మధ్యన, రూ. 45 లక్షలతో ధర్మపేట, నెహ్రూనగర్ మధ్యన సీసీ కాలువలు
- ఎఫ్‌సీఐ కాలనీలో రూ.50 లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణం
- నందికొట్కూరు రోడ్డు వైపు మారుతినగర్‌లో రూ.25 లక్షలతో సీసీ రోడ్డు
- జమ్మిచెట్టు వద్ద ఉన్న క్రీడా మైదానంలో రూ.15 లక్షలతో హైమాస్ లైట్లు

28 వరకు న్యాయవాదుల విధుల బహిష్కరణ

కర్నూలు : రాష్ట్ర బార్ కౌన్సిల్ నిర్ణయించిన వెల్ఫేర్ స్టాంపు రూ.20కు వ్యతిరేకంగా ఈనెల 28 వరకు విధులు బహిష్కరిస్తున్నట్లు జిల్లా అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు టి.నాగభూషణం నాయుడు, ఎం.వి.చక్రపాణి తెలిపారు. న్యాయవాదులందరూ సహకరించి ఆందోళనను విజయవంతం చేయాలని మంగళవారం ఓ ప్రకటనలో కోరారు.

ఐఎన్‌టీయూసీ ఆధ్వర్యంలో ఆయుధ పూజ

కర్నూలు(సెంట్రల్): ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు బి.బతుకన్న ఆధ్వర్యంలో ఆయుధ పూజ నిర్వహించారు. మంగళవారం ఉదయం 11 గంటలకు రైల్వే గూడ్సు షెడ్డులో రైల్వే కాటాకు పూజలు జరిపారు. ఈ పూజ కార్యక్రమానికి డీసీసీ అధ్యక్షుడు కె.బాబురావు హాజరయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ..కార్మికులు ఐక్యంగా సమస్యల పరిష్కారం కోసం పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు.

రేపు 'శ్రీకృష్ణ - తులాభారము' నాటక ప్రదర్శన

కర్నూలు కల్చరల్: టీజీవీ కళాక్షేత్రం ఆధ్వర్యంలో ఈనెల 26వ తేదీ సాయంత్రం 6.30 గంటలకు సీక్యాంప్‌లోని కళాక్షేత్రంలో 'శ్రీకృష్ణ - తులాభారము' నాటక ప్రదర్శన ఏర్పాటు చేసినట్లు కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య పేర్కొన్నారు. ప్రముఖ రంగస్థల కళాకారులు కోటేశ్వరరావు, గణేష్‌కుమార్, విజయదుర్గ, రత్నశ్రీలు ప్రధాన పాత్రల్లో నటించనున్నట్లు తెలిపారు. కళాభిమానులు అందరూ పాల్గొనాలని కోరారు.

బుడగ జంగాల సమస్య పరిష్కారానికి కృషి

- ఎంపీ డా.ఎస్ సంజీవ్‌కుమార్‌ను కలిసిన బుడగజంగాల నేతలు


ఎంపీ డా.ఎస్ సంజీవ్‌కుమార్‌కు వినతి పత్రం అందిస్తున్న బుడగ జంగాల నేతలు

కర్నూలు(అర్బన్): దశాబ్దాలుగా బుడగ జంగాల జాతి ఎదుర్కొంటున్న సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తామని కర్నూలు పార్లమెంట్ సభ్యులు డా.ఎస్ సంజీవ్‌కుమార్ చెప్పారు. మంగళవారం ఆంధ్రప్రదేశ్ బేడ బుడగ జంగం సంక్షేమ సంఘం నేతలు ఎంపీని కలిసి తమ జాతికి న్యాయం చేయాలని వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు తూర్పాటి మనోహర్ మాట్లాడుతూ తమ జాతికి ఇచ్చిన హామీ మేరకు షెడ్యూల్ కులాల్లో తాము కోల్పోయిన హక్కులను అమలు చేసేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అసెంబ్లీ, క్యాబినేట్‌లో తీర్మానం చేసి కేంద్ర ప్రభుత్వానికి పంపారన్నారు. ఈ నివేదికపై పార్లమెంట్‌లో ప్రస్తావించి, తమ జీవన స్థితిగతులను కేంద్ర ప్రభుత్వంలోని పెద్దలకు తెలియజేసి న్యాయం చేయాలన్నారు. ఎంపీని కలిసిన వారిలో నాయకులు కొండపల్లి, గోకారి, కళ్యాణ మారెప్ప, సిరువాటి రంగస్వామి, బైల్పాటి మద్దిలేటి, పెద్ద చింతలయ్య తదితరులు ఉన్నారు.

గుర్రాల పారువేట అదుర్స్


విజయం సాధించిన అశ్వంపై వేమనగరి కుటుంబీకులు

మద్దికెర: విజయదశమి పండుగ పురస్కరించుకొని సోమవారం నిర్వహించిన గుర్రాల పారువేట అశేష జనవాహిని మధ్య కనులపండువగా సాగింది. పారువేటలో వేమనగిరి యాదవరాజులు జగదీల్ రాయుడు విజయం సాధించారు. ఈ కార్యక్రమంలో గ్రామానికి చెందిన పెద్దనగిరి, చిన్న నగిరి, వేమనగిరి కుటుంబాలకు చెందిన యాదవ వంశీకులు రాజదుస్తులతో ఠీవిగా గుర్రాలపై కూర్చోగా, వారి వెంట ఆయుధాలు ధరించిన సైనికులు ఊరేగింపుగా గ్రామ సరిహద్దులోని రాగిమాను కట్ట వద్దకు వచ్చారు. గ్రామానికి 3 కి.మీ దూరంలో బొజ్జనాయుని పేట గ్రామంలో వున్న భోగేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అక్కడి నుంచి ప్రారంభించిన గుర్రాల పారువేటలో వేమనగిరి కుటుంబానికి చెందిన వారు ముందుగా మద్దికెరకు చేరుకొని విజయం సాధించారు. అనంతరం గ్రామ ప్రధాన రహదారిలో అశేష జనవాహిని మధ్య విజయం సాధించిన అశ్వాన్ని ఊరేగించారు. పెద్ద ఎత్తున ప్రజలు, యాదవరాజ వంశీకులు రాజన్నయాదవ్, నీలకంఠరాయుడు, జయరామ రాజు, ఈశ్వర రాయుడు పాల్గొన్నారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్ఐ రిజ్వాన్ మహమ్మద్ బందోబస్తు నిర్వహించారు.

యూనివర్సిటీ పాలక మండలి సభ్యురాలిగా శైలజ రాణి

నంద్యాల(న్యూటౌన్): రాయలసీమ యూనివర్సిటీ పాలకమండలి సభ్యులను నియమిస్తు రాష్ట్ర ప్రభుత్వ ఉన్నత విద్యా శాఖ ప్రధాన కార్యదర్శి శ్యామలా రావు ఉత్తర్వులు జారీ చేశారు. పాలక మండలి సభ్యులుగా నంద్యాల ప్రభుత్వ డిగ్రీకళాశాల బోటనీ లెక్చరర్ డాక్టర్ శైలజా రాణిని నియమించినట్లు నంద్యాల ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ శశికళ మంగళ వారం తెలిపారు. పాలక మండలి సభ్యులుగా నియామకమైనవారు మూడేళ్ల పాటు కొనసాగుతారని తెలిపారు.

లారీని ఢీకొని వ్యక్తి మృతి

మంత్రాలయం: కల్లుదేవకుంట గ్రామ శివారులో ఆగి ఉన్న లారీని ఢీకొని బైకిస్ట్ దుర్మరణం చెందాడు. మంత్రాలయం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎమ్మిగనూరు పట్టణానికి చెందిన మోహన్ రాంపురం గ్రామానికి చెందిన మేఘనను పెళ్లి చేసుకున్నాడు. వీరికి రెండేళ్ల కుమార్తె ఉంది. దసరా పండుగ సందర్భంగా రాంపురం గ్రామానికి ద్విచక్ర వాహనంపై వెళుతూ ఆగి ఉన్న లారీని ఢీకొట్టడంతో మోహన్ (25) అక్కడికక్కడే మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎమ్మిగనూరు ఆస్పత్రికి తరలించారు.

మహానందిలో భక్తజన సందడి


మహానందీశ్వరుడి దర్శనార్థం వేచి ఉన్న భక్తులు

మహానంది: మహానంది ఆలయంలో మంగళవారం భక్తులసందడి నెలకొంది. దసరా సెలవులు కావడంతో రెండు తెలుగురాష్ట్రాలతో పాటు తమిళనాడు, మహారాష్ట్ర, కర్ణాటకల నుంచి భక్తులు అధిక సంఖ్యలో ఆలయానికి తరలివచ్చారు. భక్తులరాకతో ఆలయ ప్రాంగణాలు కళకళలాడాయి. ఆలయానికి చేరుకున్న భక్తులు రుద్రగుండం, చిన్నకోనేరుల్లో పుణ్యస్నానాలు ఆచరించి శ్రీ కామేశ్వరీదేవి, మహానందీశ్వరస్వామి వార్లను దర్శించుకుని భక్తి శ్రద్ధలతో పూజలు చేపట్టారు. ఉదయం నుంచి ప్రారంభమైన స్వామి,అమ్మవారి దర్శనం రాత్రి వరకు నిర్విరామంగా కొనసాగింది. ఆలయ ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో సిబ్బంది ఏర్పాట్లు పర్యవేక్షించారు.

నేడు దుర్గమ్మ విగ్రహాల నిమజ్జనోత్సవం

- సంకల్‌బాగ్ దుర్గా ఘాట్‌లో ఏర్పాట్లు
- పూజల అనంతరం ప్రారంభం కానున్న శోభాయాత్ర


కుమ్మరి వీధిలో కొలువు దీరిన దుర్గమ్మ


నిమజ్జనం జరిగే దుర్గా ఘాట్


ఏర్పాటు చేసిన స్వాగత తోరణాలు


ప్రధాన వేదిక

కర్నూలు కల్చరల్: దుర్గా మాత విగ్రహాల నిమజ్జనోత్సవ వేడుక బుధవారం సంకల్ బాగ్ తుంగభద్ర నది తీరంలోని దుర్గాఘాట్‌లో జరగనుంది. టీజీవీ కళాక్షేత్రం, గీతా ప్రచార సమితి, దుర్గా మాత విగ్రహాల నిమజ్జనోత్స సమితి ఆధ్వర్యంలో జరిగే ఈ కార్యక్రమానికి ఏర్పాట్లు పూర్తి అయ్యాయి. నగరంలోని పలు ప్రాంతాల నుంచి సుమారు 120 విగ్రహాలు శోభాయాత్రగా దుర్గా ఘాట్‌కు చేరుకోనున్నాయి. మహిళలు బోనాలు, కలశాలతో యాత్రలో పాల్గొననున్నారు. అతిథులు గంగమ్మకు పూజలు నిర్వహించి నిమజ్జనాన్ని ప్రారంభించనున్నారు.

పూర్తయిన ఏర్పాట్లు

దుర్గమ్మ విగ్రహాల నిమజ్జనానికి ఏర్పాట్లు పూర్తి అయ్యాయి. సాయంత్రం జరిగే నిమజ్జనానికి ప్రధాన వేదిక, క్రేన్లను ఏర్పాటు చేశారు. నిమజ్జనాన్ని వీక్షించేందుకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు లేకుండా అధికారులు చర్యలు తీసుకున్నారు. ఫ్లడ్‌లైట్లు, రంగు రంగుల విద్యుత్ దీపాలు, సాంస్కృతిక ప్రదర్శనల వేదిక, స్వాగత ద్వారాలను సిద్ధం చేశారు. నిమజ్జనానికి సంబంధించి మంగళవారం మౌర్యా ఇన్‌లో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రాజ్య సభ మాజీ సభ్యులు టీజీ వెంకటేష్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం లాగే ఈ ఏడాది దుర్గా ఘాట్‌లో నిమజ్జనం జరుగుతుందన్నారు. నిమజ్జన ఘాట్ వద్ద ఆధ్యాత్మిక సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశామన్నారు. నిమజ్జనోత్సవం విజయవంతానికి అందరూ సహకరించాలన్నారు. కమిటీ సభ్యులు టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య, చల్లా దామోదర్‌రెడ్డి, దాశెట్టి శ్రీనివాసులు, బ్రాహ్మణ సంఘం కర్నూలు నగర అధ్యక్షుడు కల్లె చంద్రశేఖర్ శర్మ, మహేష్, మహాబలేష్, రామస్వామి, తదితరులు పాల్గొన్నారు.